'న్యూజెర్సీ కథ'

# బెంగ

## -ఇచ్ఛాపురపు రామచంద్రం

ఫ్రమ్ అడ్రస్ లేని బరువయిన కవరు!

ఆత్రంగా తెరిచేసరికి—పైన చిన్న ఉత్తరం.

'భార్గవగారూ! మావారూ, మీ మిత్రత్రయంలో ఒకరూ అయిన మీ మిత్రులకి మీ మరో మిత్రులు వ్రాసిన ఉత్తరాలు— ఆమధ్య విచిత్రంగా దొరికాయి. ఇవి—వరదలొచ్చి మా ఆర్థిక పరిస్థితి, వారికి హఠాన్మరణం సంభవించి మా హార్దిక పరిస్థితీ ఛిన్నా భిన్నం కాకముందు—వారు జీవించి ఉండగా—వొచ్చినవని వేరే రాయక్కర్లేదనుకుంటాను. ఇవి చదివాక—వీటిని మీకు పంపడం ఉచితమనిపించింది. వారు మరణించి అప్పుడే రెండేళ్ళు!... మావారిన నీరజకి నా నమస్కారాలని చెప్పండి. మా విశేషాలేమీ లేవు—పద్మ".


పద్మ...సుబ్బారావు...వీడి దుర్మరణం...మెదడులో మెదిలి—హృదయం విషాదంతో బరువెక్కి పోయింది. రెండు నిముషాలు మౌనంగా...కళ్ళు మూసుకుని ఉండి పోయాను వీడిని తలుచుకుంటూ. నా మనసులో మాత్రం ఆత్రతే, మరణించిన నా మిత్రుడికి అతను సజీవుడై వుండగా మరొక నామిత్రుడు రాసిన ఉత్తరాలలో ఏముందా అని. రెండూ అమెరికా నుంచి వచ్చినవే. ఒక దాని మీద 2 అనే అంకె ఉండడం వల్ల ఏది ముందు ఏది వెనుక అనే సందేహానికి తావు లేకపోయింది. వాటి మీద సుబ్బారావు పేరుండడం వల్ల కాబోలు పద్మ కవర్లని కూడా భద్రంగా పంపింది. పాపం, పద్మ! విధవ. నిట్టూరుస్తూ తొలి ఉత్తరం తెరిచాను.

"ఒరేయ్, సుబ్రావ్!

నేన్రా...అప్పారావ్‌ని. నేనింకా బతికే ఉన్నా నోరేయ్. నువ్వూ బతికుండే ఉంటావు. పాపీ చిరాయుః మనం తొందరగా పోయే ఘటాలం కాములే. ఒరేయ్, నువ్వ అమలాపురం—వెలవంకలో బతుకుతూంటే నేను అమెరికా—న్యూజెర్సీలో బతికేస్తున్నాను. మొత్తమ్మీద యిద్దరమూ భూమ్మీదే ఉన్నాం. అమెరికా ఐనా ఇండియా ఐనా నేలమీదే కదా. నీ నుంచి హటాత్తుగా ఈ ఉత్తరం ఊడిపడ్డానికి కారణముందిరోయ్.

నేన్నూ—మనూరొస్తున్నాను. నిజమేరా. పదిహేనేళ్ళ కిందట మంచి బతుకు కోసం మరో దేశం పోయిన నేను—మనూరు వొస్తున్నా్రా....మన వాళ్ళందర్నీ చూడ్డానికి మావారితో వారం రోజులు సరదాగా గడపడానికే. మనూరు వెళ్తానమకువేసరికే—ఆ భావనకే—నాకెంతానందంగా ఉందో తెలుసా? కొత్త బట్టలు, బాణా సంచా దీపావళి పండగ్గురించి ఊహించుకుంటేనే ఉవ్విళ్ళూరిపోయే వాళ్ళమే చిన్నప్పుడు. అచ్చం అలా ఉందిప్పుడు నా మనసు మనూరెళ్తానుకుంటూంటేనే.


అసలు...కవరు మీద మనూరిపేరు రాస్తుంటేనే ఆనందం పట్టలేక కిందా మీదా ఐపోయాననుకో. పలకడానికైతేనేం, రాయడానికైతే ఏం ఎంత చక్కని పేరురా మన వూరిది! వెలవంక! ఏం కవితాత్మక నామం! దేవులపల్లి కృష్ణశాస్త్రిలాటి ఏమహా భావకవో మనూరికి నామకరణం చేసుంటారు.



పేరంత చక్కనిదే మన వూరును. కదూ?

ఆంధ్రప్రదేశ్ ప్రశాంతమయిన రాష్ట్రమయితే—దానిలో కోనసీమ కోటి అందాల సీమ. దాన్లో చందమామంత చక్కగా మన వెలవంక. వీడేమిటి, ఊరు గురించి పేజీలు రాసేస్తున్నాడు— అనుకుంటున్నావా? నీకు తెలియదులే ప్రవాసాంధ్రుడి — పైకి చెప్పకోలేని బెంగ. జన్మభూమిని తలుచుకుంటే చా—హృదయం ఉద్విగ్నమే. నీ పేరు తలచినా చాలు, మదిలో పొంగు శతకోటి యమునా తరంగాలన్నట్లే. అందులోనూ—కాంక్రీట్ జంగిల్స్, ఆకాశ హర్మ్యాల అమెరికాలో ఉండే, మన జీవితాన్నెవరెవరో ఉరుకులూ పరుగులూ తీయించే, ప్రశాంతమన్న పదానికే తావుంచని అమెరికాలో ఉండే వాడికి— కొబ్బరి చెట్లు...అరటి చెట్లు...పంటచేలు...కాలువలు...గోదావరి పాయ.... మెల్లగా కదిలే మనుషులు, కాలమూ, మనసులోంచి వొచ్చే పలకరింపులు...తలచుకుంటే చాలు మనసెంత తీయగా ఐపోతుందో! జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరియసీ అన్నది. ప్రవాసాంధ్రులకే నిజంగా అనుభవంలోకి వస్తుంది. ప్రవాసాంధ్రులనేస్తున్నామ పొరపాటుగా ప్రవాస భారతీయులనాలి కాబోలు.

మన తెలుగుమాట! తేట తెనుగుమాట! ఎంత తియ్యనో చెప్పలేను. దీనినెవరో ఇటలియనాఫ్ దయీస్ట్ అన్నారనీ, మరొక రెవరో—దేశ భాషలందు తెలుగు లెస్స అన్నారనీకాదు. మాతృభాషని. అమ్మ మాటంటే—అదో అభిమాన సర్వస్వమే. అందులోనూ—హాయ్, యాంకీ, గయ్‌ల కీసర బీసర అమెరికన్ భాష వినీ వినీ విసుగెత్తిన వాడికి తన



మాతృ భాష తెలుగు వివే అవకాశమంటే తక్కువ ఆనందంగా ఉంటుందా?

సుబ్రావ్! ఒరేయ్, డబ్బారేకుల సుబ్బారాయుడూ! నేవక్కడువ్నన్నాళ్ళూ తెలుగులోనే. మాటలు సంభాషణలూ సాగా )సుమా! మనమ్మ ఉండగా మరో అమ్మా, మన భాషుండగా మరో భాష దేనికోయ్ బడుద్ధాయ్!

ఔనూ...మనసింకా సర్కారు జిల్లాల వాళ్ళూ విశాఖ జిల్లాల వాళ్ళూ తూ.గో.జిల్లావే అంటున్నారా? అన్నట్లు ముంగండగ్రహారం ఒసారి వెళ్ళాలి. అక్కడి వేద పండితులచేత సామ వేదమూ, పనసలో చదవించి...రికార్డు చేసి... అమెరికా వాళ్ళకి చూపాలి ఆంధ్రుల సత్తా, సంస్కృతమూ. తెలుగు అంతటిది యింతటిదీ...తెలుగువాడంత గొప్పవాడంత గొప్పవాడూ, ఆత్మాభిమానం. అదీయిదీ అంటూ గుండెల్లోంచి పీండ్రించుకుని అరవడం కాదు, తన భాషని, సంస్కృతిని, ఆచారాల, అలవాట్లని, అందచందాలనీ, పరీరక్షించుకునే వాడే నిజమయిన తెలుగువీరుడు. ఒరేయ్, సుబ్బిగా...నేనొచ్చేది ఆవకాయ సీజన్‌లో. మీ అమ్మగారికి నేనొస్తున్నాని చెబితే దెయ్యాలావకాయ పెడతారు. ఏమిటలా తెల్ల బోతావ్! వెర్రిమొహమా! దయ్యాలవకాయంటే మంచి కారంగా ఉండే అవకాయ్. మనలాటి నాటు సరుకు తప్ప సామాన్యులు గుజ్జనులూ తిన్లేరు. అన్నట్లు గోంగూర పచ్చడి 'అవస్యం' సుమా! కెంటికి చికెన్ తినితిని నోరు చచ్చి పోయిందనుకో. గోంగూర పచ్చడి అన్నంలో మిళాయించి-చారెడు మావేసి మళ్ళి కలిపి-గామగ మూనె సుమా- విస్తరి చివర నెయ్యి ముద్ద పెట్టుకుని..పచ్చడీ అన్నం కలిపాక దానిమీద ఓ గరిటెడు గడ్డ పెరుగు వేసి-మళ్ళీ కలిపి...ఓ ముద్దా పేరుకున్న నెయ్యీ, ఓ ముద్దా- నీరుల్లిపాయ కొరికిన ముక్కా...అలా లాగిస్తుంటే అరిటాకులోకి సరాసరి స్వర్గం దిగిరాదూ?

భార్గవకి చెప్ప నేనొస్తున్నానని. వెధవ్వేషాలేం వెయ్యక నేనక్కడున్నన్నాళ్ళూ సెలవు పెట్టి మనతోనే గడపాలని చెప్ప. మనం బళ్ళోనూ కాలేజీలోనూ 'మిత్రత్రయం' గా 'త్రిమస్కెటీర్స్'గా ఘనకీర్తి సంపాదించిన వైనం వాడికి గానం చేసి వినిపించు అవసరమైతే. ఎలాగయినా సరే-మన మిత్రులం అందరమూ కలిసి సరదాగా గడపాలి. అర్థమయిందా అబ్బాయ్? ఏమిటి సణుక్కుంటున్నావ్? ఈ సత్తిగాడికి ఉన్నవూరంటే-అదే...పుట్టినూరంటే యింత అభిమానముండేడిస్తే- యిన్నాళ్ళూ ఒక్క ఉత్తరమేనా రాసిపడేశాడు కాదేం? అనేనా? ఒరేయ్ సుబ్బులూ! నీ సందేహానికి సమాధానం అమెరికాలో భారతీయుడి జీవిత విధానమే చెప్పాలి. ఇక్కడమనం ద్వితీయశ్రేణి పౌరులం. కనుక అమెరికన్లతోపాటు సమంగా జీతం పొందాలంటే వీళ్ళపని గంటలకి రెట్టింపు సేపు పని చెయ్యాలి. మూడు పార్లు తడవకి ఒక్కో గంట చొప్పన విరామంతో కలిపి నేను రోజుకి పదిహేను గంటలు పని చేస్తానంటే నమ్ముతావా? తరువాత-ఉత్తరం రాసేంత తీరికా ఏకాగ్రత కూడా మిగల్చదీ అతివేగ అమెరికన్ జీవన విధానం. ప్రతి నిమిషమూ కాలం నిన్ను కొరడా ఝుళిపిస్తూ తరుముతూనే ఉంటుంది. అదీ కాక ఉత్తరమంటే తలపోతలు. గతాన్ని తవ్వుకోడం. జ్ఞాపకాలు. మీరూ, మనూరు జ్ఞాపకంవొస్తే-వెంటనే రెక్కలు కట్టుకుని అక్కడ వాలకుండా ఉండగలనా? అది సాధ్యం కాదు కనుకనే యిన్నాళ్ళూ ఉత్తరం రాయక పోవడం. వొచ్చేనెల-పన్నెండో తారీకుకల్లా నేను నెలవంక చేరుతాను. అబ్బ! ముద్దబంతి పువ్వుల్లా గుండ్రంగా ఉండే తెలుగక్షరాలు, తియ్యని తెలుగు మాటలూ రాస్తుంటే ఎంత బాగుందీ! ఉంటాను..అహా..వొస్తాను.


నీ సత్తిగాడు

ఉత్తరం చదివేసరికి ఏడుపొచ్చేసింది. మిత్రత్రయంలోని సుబ్బిగాడిప్పుడు లేడు. విమాన ప్రమాదంలో దుర్మరణం చెందాడు. అమలాపురానికి వరదలొచ్చాయి. జిల్లాలో అతనికున్న ఆస్తిపాస్తులు వరద పాలయ్యాయి-ఓడలని బళ్ళు చేస్తూ .

రెండో ఉత్తరం తెరిచాను కళ్ళుతుడుచుకుని.

"సుబ్బా! కలలు పగిలి, ఆశలు చెదిరి, ఊహలు కరిగి...మనసు వికలమై...బాధతో, విషాదంతో-విధిలేక ఈ ఉత్తరం వ్రాస్తున్నామరా, ఎన్నికన్నీళ్ళొస్తున్నా తుడుచుకుంటూ.. కొంచెం హృదయం, పిసరంత భావుకత ఉన్న ఎవరికేనా అర్థమౌతుంది నా ఆవేదన.

నేను నా ఆశల మూటలతో నెలవంక వొచ్చేసరికి-నువ్వులేవు. అశని పాతంలాటి మాట వ్యాపార నిమిత్తం గల్ఫ్ దేశాలకు యాత్ర వెళ్ళా






వట. నేను తిరుగు ప్రయాణమయిన వాటికీ రాలేదు. నేను వొచ్చే ముందురాసిందీ, యిదీ, రెండుత్తరాలూ ఒకేసారి చదువుతావేమో. భార్గవగాడు కూడా కుటుంబ సమేతంగా యాత్రకి పోయాట్ట సరిగ్గా సమయానికే–దరిద్రుడు తలకడిగితే వడగళ్ల వానంటారే అలాగే నేను వొచ్చే సరికే మీరిద్దరూ ఎక్కడి కోపోవడం.

చేయగలిగేదిలేక ఒంటరినై పోయానే అని ఓసారి పాడుకుని–విచారించి–కళ్లు తుడిచేసుకుని–మనం చదువుకున్న బడిని చూద్దామని బయలు దేరాను. ఆ బడిని పట్టుకుందుకు పడిన అవస్థలు తలుచుకుంటుంటే సిగ్గేస్తుంది. వీధికొక కాన్వెంట్! వాటిపేర్లు కూడా తెలుగువి కావు. గుడ్ షెపర్డ్...మేరీలాంబ్...డైమండ్స్...టైనీటాట్స్...బ్లూకాన్వెంట్. ..అలాటి అన్య దేశ నామరాజమే! మన 'ప్రాధమికోన్నత పాఠశాల' ఎంతకీ కనిపించదే! చిట్టచివరకెలాగో కనుక్కునేసరికి–ఒకప్పుడు గుడిలో కలకలలాడిన మన బడి–శిథిలావస్థలో–మూసవి అమ్మలా ఏండి దయనీయంగా ఉంది. అందరిచేత నిర్లక్ష్యం చేయబడి పైకే కాదు. లోపలా అలాగే ఉంది పాడుపడి. గేటు ముందర ఓ ముసలమ్మొండేది– జీళ్ళూ, వేగోడీలూ, పాకుండలూ అమ్ముతూ. మగపిల్లల నాడపేర్లు పెట్టి, ఆడ పిల్లలని మగ పేర్లతోనూ పిలుస్తూ ఉడుక్కునే వాళ్లని చూసి నవ్వేది. నిన్ను సుబ్బమ్మ...నన్ను సచ్చేతి, రాఘవనేమో రాఘవమ్మ అని పిలిచేది. అమామ్మొంటే కొయ్య వేగోడీలూ, జీళ్ళూ కొనుక్కుందామని ఎంత చూశానో! నువ్వు నమ్మితే నమ్ము, మానితే మాను. నీకు నిజం, నీకబద్ధం...కెంటకీ చికెన్ కంటె కొయ్య వెగోడీలే నాకిష్టం. చూయింగ్ గమ్‌కంటే పిండి జీళ్లే నాకు ప్రీతి. కాని...ఆ ముసిలమ్మా లేదు. జంగిడీ లేదు. పేలాలుండలు తిందామన్న నా ఆశ ఆడియాసే అయింది. ఆ మామ్మ–చనిపోయిందట–అమ్మకాలు లేక, పేదరికంతో. ఎంతో బాధేసింది. రోడ్లన్నీ తిరిగినా అనాటి వేగోడీలూ పకోడీల లాటి ఎక్కడా కనపడవే! ఎంతసేపూ ఫాస్ట్ ఫుడ్ స్టాల్స్ తప్ప. ఐస్క్రీం పార్లర్లే తప్ప!

అప్పటికి సాయంత్రమౌతుంటే–చిన్నప్పటిలాగ...చెరువుకి నడిచాను. నీకు జ్ఞాపక ముండే ఉంటుంది. మనం ఆ చెరువు వొడ్డున పీతలనీ నీటి పాములనీ వేటాడే వాళ్లం. గేదెల కాపర్లతోపాటు మనమూ గేదెల వీపులమీద కూర్చుని చెరువులొ షికార్లు కొట్టే వాళ్ళం. చెరువులో కలవపూలు కోసుకొచ్చి దండలల్లి దేముడి మెడలో వేసేవాళ్ళం. మనం వేసిన కలువపూల దండలలో దేముడెంత బాగుండే వాడో! పూజారి మనకి ఎక్కువ ప్రసాదం పెట్టేవాడు దండలు తెచ్చి వేశామని. కోవెలగార్లు....దద్దోజనం...చక్కెర పొంగలి...ఓహ్! ఏం రుచిగా ఉండేవి స్వామి ప్రసాదాలు!

---

**న్యూజెర్సీ కళాసమితి, ఆంధ్రజ్యోతి సచిత్రవారపత్రిక సంయుక్తంగా నిర్వహించిన '97 కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ**

---

ఇప్పడా చెరువుకి చుట్టూ ముళ్ల కంచె! ఆశ్చర్యపోయాను. తడక గేటుంటే అక్కడికొచ్చాను. కాపలాదారు– అటకాయించి–యజమాని అనుమతి లేనిదే లోపలకు వెళ్లకూడదనేశాడు. ఆ యజమానేమో దేశంలోనే లేరట! అది–రొయ్యల చెరువు చేసేశారుట. చుట్టు పక్కల చెరువులన్నీ ఆయనవేనట. అవన్నీ రొయ్యల చెరువు లేనట? ఆ రొయ్యల వ్యాపారివి నువ్వే అని నాకు తెలిసినా నేనామాట అతనికి చెప్పలేదు. పై నుంచే చూశాను. చెరువులో కలువలు లేవు. గేదెలూ లేవు. కాపరుల ఆటలూ ఈతలూ లేవు. ఆ వొడ్డునెవరూ గూటీబిళ్ళా, కబడీ ఆడడమే లేదప్పటిల్లా. నిస్పృహగా– కోవెలకొచ్చాను. విద్యుద్దీపాలు...జనాన్ని...భక్తులని వరుసలో బంధించి నడిపించే యినుప పూచలు. కోవెలచుట్టూ ఆధునికంగానూ అదనంగానూ దేముళ్ల సమూహాలు. దేముడు కూడా వ్యాపారి చేయబడ్డాడనేందుకు సాక్ష్యంగా ప్రవేశానికీ..పూజకీ, కొబ్బరికాయ కొట్టేందుకూ రుసుములు! ప్రసాదలకీ..దేముడి ప్రసాదాలకి ఖరీదులు! ఇది ఆనాటి చల్లని..చక్కని...ప్రశాంతమయిన...పల్లెటూరి కోవెల కాదు. కొత్త కోవెల. నాగరికపు కోవెల! లోపలికి వెళ్ల బుద్ధి కాలేదు. కొత్త దేముణ్ని చూడబుద్ధి కాలేదు. చూడబోతే యీదేశం దేవుణ్ని కూడా యిరవయ్యోకటో శతాబ్దంలోకి తెచ్చేసినట్లుంది! పాపం, దేముడు నీ మనసు వికలమైపోయింది. అంతకంటే కూడా బాధించే విషయాలు వినవలసి వొచ్చింది.

'సుబ్బారావిప్పడు రొయ్యల ఎగుమతి వ్యాపారంలోకి దిగాడు. ఆ పనిమీదే విదేశాలు వెళ్లాడు. ఈ చుట్టుప్రక్కల చెరువులన్నీ రొయ్యల చెరువులు చేసేవాడు. అతనికి డబ్బు జబ్బు పట్టుకుంది. ఇంగ్లీషులో 'మనీ మేనియా' ... 'మస్టెటిస్' అనొచ్చు.

ఇవి వినలేకపోయాను. 'చల్లని నీరు...గ్లాసు అర్ధ రూపాయే.' నివ్వెరపోయాను. గోదావరి పాయ ప్రవహించే వెలవంకలో–మంచినీళ్లని కొనుక్కోవలసిన దుస్థితి! మళ్లీ ఊరి నిండా మంచినీటి చెరువులే! ఓహో! సుబ్బారావ్‌గారు వాటన్నిట్నీ రొయ్యల చెరువులు చేసేసి గోదావరి తీరానికి కూడా తాగేనీటి సమస్యని తెచ్చి పెట్టాడన్నమాట!

ఎంత చెడ గొట్టిందీ డబ్బు అతన్ని! ఎంత అమానుషుణ్ణి చేసి వదిలిందీ! ఈ డబ్బు జబ్బుందే..రోగి శరీరాన్నలాగే ఉంచి మనిషి మనసుని తినేస్తుంది. సారీరా సుబ్బారావ్,

నీకూ ఈ వ్యాధి సంక్రమించినట్లుంది.

నాకెంత దుఃఖమేస్తూందో..అమలాపురంలో అమలాపురం లేదు. అమెరికాయే ఉంది.

వెలవంకలో వెలవంక లేదు. న్యూయార్క్ ఉంది. అంతెందుకు..భారతదేశంలో అమెరికాయే ఉంటుంది. నా దేశాన్ని తలుచుకుంటే బెంగగా ఉంది.

నాదేశ ప్రజలలో సగం మంది పైగా ఒక పూట తిండికి కూడా నోచుకోనివారే. కానీ యిక్కడి నుంచి విదేశాలకి రొయ్యలూ బసుమతీ బియ్యము ఎగుమతౌతాయి!

నాదేశ ప్రజలలో సగం మందికి పైగా తాగేందుకు మంచినీళ్లు దొరకనివారే. కాని యిక్కడి మంచినీటి చెరువులన్నీ రొయ్యల చెరువులుగా మార్చబడతాయి!

హతవిధీ! మన దేశం మన ప్రజల కోసం కాదు. విదేశాల కోసం! గ్లోబలైజేషన్ పేరిట మన దేశం–అమెరికా దేశపు పగటి వేషం వేసుకుంటుంది. తన ప్రజలనీ సంస్కృతినీ మరిచి అందుకే...నాకీదేశం గురించీ యీ అమ్మగురించీ ఎంతో బెంగగా ఉంది. నాకు నాదేశంలో అనుబంధాలూ ఆత్మీయతలూ ఆనందాలూ అనుభూతులూ ఏమీ మిగలేదన్న నిజం మనసుని పట్టిపీడిస్తుంటే..

నేనింకెప్పడూ మన దేశం రాలేన్రా సుబ్బారావ్. రాలేను.

సత్యనారాయణ.

మిత్రుడు సుబ్బారావ్ మరణం కంటే ఎక్కువగా బాధిస్తూంది నన్నీ ఉత్తరం.